సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూరప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు..

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– సీఎస్ఎంటీ (ముంబాయి)
- 17.30 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి –కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–కాకినాడ
- 21.00 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–ఇండోర్ (ఆదివారం)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇజ్జత్‌నగర్ విలేజ్, శిల్పా హిల్స్ రోడ్డు నంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణ విల్లాస్, న్యాక్, వసంతసిటీ, సైబర్ విలేజ్, సైబర్ వ్యాలీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీజేఆర్ నగర్ 11 కెవి ఫీడర్ పరిధిలో జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, మహావీర్ నగర్, పీజేఆర్ పోలీస్‌స్టేషన్ ఏరియాలలో..

- వినాయక నగర్ 11 కెవి ఫీడర్ పరిధిలో..ఉదయం 12 నుంచి 3 గంటల వరకు వినాయకనగర్, సమతానగర్
- వెస్టర్న్ హిల్స్ పరిధిలో.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అడ్డగుట్ట 1 నుంచి 7వ రోడ్డు, వెస్టర్న్ హిల్స్, అడ్డగుట్ట వాటర్ ట్యాంక్ ప్రాంతంలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మాధవనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, ఓల్డ్ సొసైటీ, ఎస్‌బీఐ, టెన్నిస్ కోర్టు ఏరియాలలో..

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

సీబీఆర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్స్, హుందయ్ షోరూం, గ్రీన్ లీఫ్ హాస్పిటల్, శ్రీ దుర్గ ఎస్టేట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

నేడు 'డయల్ యువర్ డిపో మేనేజర్'

రాయదుర్గం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం 'డయల్ యువర్ డిపో మేనేజర్' కార్యక్రమం జరుగుతుందని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్‌లో చెప్పవచ్చని తెలిపారు. ఫోన్ నంబర్ 9959226132లో చెప్పాలని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే 82 శాతం పూర్తి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే 82.61 శాతం అయినట్లు డిప్యూటీ కమిషనర్ పి.ముకుంద్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్‌లతో పాటు భారతీనగర్ డివిజన్ భెల్ ఎంఐజీ కాలనీలో కూడా కొనసాగుతుందన్నారు. సర్వే సమయంలో అందుబాటులో లేని వారిని గుర్తించి తిరిగి సర్వే చేస్తున్నామని వివరించారు. ఈ నెల 31వ తేదీ లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి అవుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళకు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఆన్‌లైన్‌తో పాటు వార్డు సమావేశాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వంటగది సీజ్

గచ్చిబౌలి: అపరిశుభ్రంగా ఉన్న చైతన్య కళాశాల సెంట్రల్ కిచెన్‌ను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని వశిష్ఠ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెంట్రల్ కిచెన్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరగడం, అపరిశుభ్ర వాతావరణం ఉందని అనేక పర్యాయాలు ఫిర్యాదులు రావడంతో ఈ నెల 24న ఫుడ్ సేఫ్టీ అధికారులు కిచెన్‌ను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంతో లైసెన్స్ రద్దు చేశారు. సెంట్రల్ కిచెన్ నుంచి శ్రీ చైతన్య కళాశాలలకు ఆహారం సరఫరా చేస్తున్నారు. లైసెన్స్ రద్దు చేసినా కిచెన్ యథావిధిగా కొనసాగిస్తుండడంతో ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ కర్ణన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల మంది విద్యార్థులు తినే ఆహారం విషయంలో శ్రీచైతన్య యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంతో కిచెన్‌ను సీజ్ చేశామన్నారు.

గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాలకు

విస్తరణ గండం

రోడ్డు విస్తరణలో కోల్పోనున్న 11 గదులు

- ఐదంతస్తుల భవనం నిర్మిస్తామంటున్న జీహెచ్ఎంసీ
- బహుళ అంతస్తులు చిన్నారులకు సురక్షితం కాదంటున్న ఉపాధ్యాయులు

గచ్చిబౌలి: రోడ్డు విస్తరణలో గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాల దాదాపు 11 గదులు కోల్పోయే అవకాశం ఉంది. దీంతో వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఎలా చదువుకుంటారని ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణకు పోగా మిగిలిన స్థలంలో ఐదంతస్తుల భవనం నిర్మించి ఇస్తామని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఐదంతస్తుల భవనం 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు సురక్షితం కాదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. 1963లో గచ్చిబౌలి గ్రామానికి కొద్ది దూరంలో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. ఓల్డ్ ముంబయ్ జాతీయ రహదారి గ్రామం లోపలి నుంచి వెళ్లేది. 2004లో గ్రామం బయట నుంచి ప్రాథమిక పాఠశాలను ఆనుకొని రోడ్డును వేశారు. అప్పటి నుంచి రోడ్డు వెంట ఉన్న కాంపౌండ్ వాల్ లోపల ముందు భాగంలో ప్రాథమిక పాఠశాల, వెనుక భాగంలో జడ్‌పీహెచ్ఎస్ స్కూల్ కొనసాగుతున్నాయి.

మాస్టర్ ప్లాన్ రోడ్డు

గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ మీదుగా ఆల్విన్‌కాలనీ జంక్షన్ వరకు మాస్టర్ ప్లాన్‌లో 215 అడుగుల రోడ్డు ఉంది. ఎప్పుడో జరగాల్సిన రోడ్డు విస్తరణ రాజకీయ ఒత్తిళ్లతో ముందుకు సాగడం లేదు. కొత్తగూడ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలోనూ పూర్తి స్థాయిలో విస్తరణకు నోచుకోలేదు.


ప్రధాన రహదారి పక్కన ఉన్న పాఠశాల

- ప్రస్తుతం గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ లోవల్–2 ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతోంది. కొద్ది నెలల్లో ఫ్లై ఓవర్ పనులు పూర్తికానున్నాయి. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి క్యూమార్ట్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది.
- రోడ్డు విస్తరణకు స్కూల్ స్థలం కావాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా విద్యాధికారికి లేఖ రాశారు. జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.
- స్థలం వదులుకునేందుకు ఆమోదం తెలిపితే ప్రత్యామ్నాయంగా ఐదంతస్తుల భవన నిర్మాణం చేపట్టి అప్పగిస్తామని చెబుతున్నారు.

సురక్షితం కాదు

ఐదంతస్తుల భవనం ప్రాథమిక విద్యార్థులకు సురక్షితం కాదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. చిన్నారులు పై అంతస్తులకు ఎక్కటప్పుడు.. దిగేటప్పుడు అదుపు చేయడం కష్టమని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందంటున్నారు. పాఠశాల గదులు రోడ్డు విస్తరణలో కూల్చివేస్తారని తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్‌లో సమావేశమయ్యారు. ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించి నూతన భవనం ఏర్పాటు చేసిన తర్వాతే రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాలలో మొత్తం 466 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటి, రెండు తరగతులకు రెండు సెక్షన్లు , మూడు నుంచి ఐదు తరగతులకు ఒక్క తరగతి మూడు సెక్షన్ల చొప్పున ఉన్నారు. ఆఫీస్ రూమ్, స్టాఫ్ రూమ్, వంటగది, రెండు అంగన్‌వాడీ గదులతో పాటు తరగతి గదులు రోడ్డు విస్తరణలో పోనున్నాయి.

పాఠశాలను సందర్శిస్తా : ఎమ్మెల్యే గాంధీ

రోడ్డు విస్తరణలో పోయే గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాల గదులను పరిశీలిస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఐదంతస్తుల భవనం నిర్మాణానికి జీహెచ్ఎంసీ ముందుకొచ్చిందన్నారు. ఇంకా ఏమైనా ప్రత్యామ్నాయంపై అధికారులతో చర్చిస్తానన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.


రోడ్డు విస్తరణలో పోనున్న పాఠశాల ప్రహరీ


రోడ్డు విస్తరణలో పోనున్న గదులు, ఆట స్థలం

నేడు మనూలో 'నాలెడ్జ్ సిరీస్ లెక్చర్'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'నాలెడ్జ్ సిరీస్ లెక్చర్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో 'డిజిటల్ యుగంలో సాంస్కృతిక వ్యక్తీకరణల వైవిధ్యం: అవకాశాలను వినియోగించుకోవడం, సవాళ్ళను నావిగేట్ చేయడం' అనే అంశంపై ప్రముఖ చిత్ర నిర్మాత, రచయిత, టీవీ ప్రముఖుడు సిదార్థ్ కాక్ ఉపన్యసిస్తారని ఆయన పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన నిధులు.. కొండాపూర్ ప్రేమ్ నగర్‌కి చెందిన పగడాల షామిలికి 2లక్షల 20 వేలు, హైదర్‌నగర్ డివిజన్ పరిధి ఆదిత్య నగర్‌కు చెందిన వల్లేపల్లి వెంకట్‌నరేష్‌కు 1లక్ష 10 వేల రూపాయల చెక్కులను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండి ఇబ్రహీం ,రాజు యాదవ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ. 20 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగిని

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఓ మహిళ రూ.20 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగినికి డిసెంబర్ 13వ తేదీ ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక మెసేజ్ వచ్చింది. దీంతో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేయడంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఆ ఉద్యోగిని నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తు వచ్చింది.. పెట్టిన నగదుతో పాటు, లాభాలు చూపిస్తూ వచ్చారు. పలు దఫాలుగా రూ.20 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లింక్ ఓపెన్ చేసి డెలీట్ చేశారు..

ఖాతాలో నుంచి నగదు మాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడంతో ఖాతాలో నుంచి రూ.39 వేలు పోయిన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో మంగళవారం జరిగింది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నివాసం ఉండే ముఖేష్ ఫోన్‌కు మంగళవార ఫ్లిప్‌కార్ట్ నుంచి ఓటీపీలు వచ్చాయి. వెంటనే అతను కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఫ్లిప్‌కార్ట్‌లో ఏమైనా బుక్ చేశారని అడిగారు. వారు బుక్ చేయలేదని చెప్పడంతో ఆ లింక్‌ను ఓపెన్ చేసి డెలీట్ చేశాడు. అంతలోనే రూ.14వేలు, రూ. 25వేలు రెండుసార్లు అతని ఖాతాలో నుంచి డబ్బులు పోయినట్లు గుర్తించాడు. వెంటనే కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. 2 వేలు జరిమాన, ఐదుగురికి రూ. 1500, ఒకరికి మూడు రోజుల జైలు, మరోకరికి 2రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బస్తీల్లో ఎంఆర్‌పీఎస్ నాయకుల ప్రచారం

రాయదుర్గం: 'వేలగొంతులు ..లక్ష డప్పులు ' అనే నినాదంతో జరిగే సమావేశంలో ఇంటికొకరు డప్పుతో రావాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు బస్తీలవారీగా ప్రచారం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపుపై ఫిబ్రవరి 7న నగరంలో జరిగే సమావేశానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి నానకరాంగూడలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి గణేష్ మాదిగ మాట్లాడుతూ మాదిగలకు న్యాయం చేయాలని, రిజర్వేషన్లను విధిగా అమలు చేయాలనే లక్ష్యంతో ఈ ఉద్యమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ స్థానిక నాయకులు నరేష్, సుధాకర్, నర్సింగరావు, నర్సింహ, రాజు, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.


నానకరాంగూడలో పర్యటిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఆ రెండు గ్రామాలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో చేర్చండి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలంలో మిగిలిన జానకంపేట, వడక్‌పల్లి గ్రామాలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో చేర్చాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎంఏయూడీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మండల పరిధిలోని 8 గ్రామ పంచాయతీలలో ఆరు గ్రామ పంచాయతీలను ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారని తెలిపారు.రెండు గ్రామాలు విలీనం కాకపోవడంతో పరిపాలనాపరంగా.. అభివృద్ధి కోణంలో తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు. మిగిలిన రెండు గ్రామాల అంశంలో వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరామని తెలిపారు.కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం


కార్మికులను సన్మానిస్తున్న జేపీనగర్ అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని జేపీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. జేపీనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరిశుభ్రతకు కృషిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జేపీనగర్ అసోసియేషన్ సభ్యులు రామాంజనేయరెడ్డి, రామారావు, మహేశ్వర్‌రెడ్డి, నరేందర్ ముదిరాజ్, కాలనీవాసులు ఉన్నారు.

నేటి నుంచి మ్యూజిక్ ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నేటి నుంచి హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన మ్యూజిక్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. ఫిబ్రవరి రెండవ తేదీ వరకు సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను అలరించనున్నారు. చివరి రోజు నగర సంకీర్తనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

నేడు 'సైబర్ క్రైమ్'పై అవగాహన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం 'సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ కార్యాలయం, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ టీమ్, తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీజీసీహెచ్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ క్యాంపస్‌లోని సీఐఎస్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది.విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ బాలవిహార్ పార్కులో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ బి.పుష్ప అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సురేష్‌తో కలసి బాలవిహార్ పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ కాజీపల్లి పరిధిలోని సర్వే నంబర్ 181లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలంలో నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో గుమ్మడిదలకు రఘు, గడ్డపోతారానికి మంగతాయారులు ఇన్‌చార్జ్ కమిషనర్లుగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికుల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

వరదనీటి కాలువ పనులు పరిశీలన



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్ రోడ్డులోని హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద చేపడుతున్న వరదనీటి కాలువ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీ జరుగుతుందని తగు చర్యలు చేపట్టాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

స్టార్టప్‌ల అభివృద్ధికే 'టీ-ఎడ్జ్'

టీ హబ్–నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం మధ్య భాగస్వామ్యం


టీహబ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో 'టీ–ఎడ్జ్' కార్యక్రమాన్ని మంగళవారం ప్రకటించారు. పకడ్బందీ వ్యూహం, ఆవిష్కరణలతో స్టార్టప్‌లను అభివృద్ధి చేయడానికి భారతదేశంలోని ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీహబ్ దాని న్యాయ, ఆర్థిక బృందం కలిసి టీ–ఎడ్జ్‌ను ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. చట్టపరమైన, ఆర్థిక సేకరణ విషయాలపై సమగ్ర సలహాలను అందించడం ద్వారా స్టార్టప్‌లను బలోపేతం చేయడంపై టీఎడ్జ్ దృష్టి సారిస్తుందన్నారు.

టీహబ్– నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంల మధ్య భాగస్వామ్యం కుదిరింది. అనంతరం 'ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్'ను వేగవంతం చేయడంలో ఐపీ పాత్ర' అనే అంశంపై ప్యానల్ చర్చను నిర్వహించారు. టీహబ్ ఉపాధ్యక్షుడు సంతోషిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐపీఆర్ చైర్ డాక్టర్ అనింద్య సర్కార్, ఆస్కార్ లీగల్ సర్వీసెస్ వ్యవస్థాపకులు నవీన్‌కుమార్, రీసల్యూట్ గ్రూప్, రెసల్యూట్ 4ఐపిలో లీగల్ హెడ్ శభజిత్‌సాహ, ఓభన్ అండ్ అసోసియేట్స్‌లో భాగస్వామి చారుల్ యాదవ్ పాల్గొని తమ అభిప్రాయాలను ప్రకటించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన కాపీరైట్ సవాళ్ళు, ప్రపంచ పేటెంట్లను దాఖలు చేయడానికి ఆచరణాత్మక విధానాలు, అంతర్జాతీయ మార్కెట్లలో అమలు, సవాళ్లపై సమావేశంలో చర్చించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని, హెల్మెట్, సీటు బెల్టు తప్పకుండా ధరించాలన్నారు. సిగ్నల్ జంప్ చేయవద్దని, స్టాప్ లైన్ వద్ద ఆగాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఫిట్‌నెస్ ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నింబంధనలు తూచా తప్పకుండా పాటిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లబ్యాడ్జీలతో నిరసన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈఎస్ఐను సొసైటీ చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి నిరసనగా మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి ముందు వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డా.రమేష్ మాట్లాడుతూ పాలకులు ఈఎస్ఐను ప్రైవేటీకరణ చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాదిమంది కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఈఎస్ఐను ప్రైవేటీకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్, బ్రిజ్ మోహన్, ఆదిత్య, నాయకులు నాగరాజ్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.


ఈఎస్ఐ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నేడు శంకుస్థాపన

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో సుమారు రూ.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌లోని బవార్చి హోటల్ నుంచి వార్డు కార్యాలయం నుంచి కాయిదమ్మకుంట చెరువు వరకు రూ.45 లక్షలు, మైత్రీనగర్ ఫేజ్ 1లో రూ.25 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

2న మెగా జాబ్ మేళా

చింతల్: ఆదిత్య అండ్ మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కోడి ఆదిత్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీలలో ఉత్తీర్ణత సాధించిన యువత కోసం విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్, జెన్ ప్యాక్ కార్పొరేట్ సంస్థల ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపంలో మేళాను ఆదివారం ఉ.9 నుంచి సా. 5 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. 8309447458, 96520 98401 ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.